# బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పని చేయాలి

- అభివృద్ధి, సంక్షేమ పథకాలు, బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- సోషల్ మీడియా వారియర్స్ సమావేశంలో ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్

హాలియా, నవంబర్ 1: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు, బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయమే లక్ష్యంగా సోషల్ మీడియా వారియర్స్ పని చేయాలని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్ అన్నారు. బుధవారం హాలియా క్యాంప్ కార్యాలయంలో జరిగిన బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా వారియర్స్ సమావేశంలో ఆయన మాట్లాడినారు. గత తొమ్మిదిన్నరేండ్ల కాలంలో సీఎం కేసీఆర్ పాలనలో జరిగిన అభివృద్ధిని, మూడోసారి అధికారంలోకి వచ్చాక చేపట్టబోయే కార్యక్రమాలను ప్రజలకు చేరవేయాలని సూచించారు. నియోజకవర్గంలో ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు కాంగ్రెస్ పార్టీ నాయకులు గోబెల్స్ ప్రచారం నిర్వహిస్తున్నారని, సోషల్ మీడియా వేదికగా వారు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ఎక్కడికక్కడ ఎండగట్టాలన్నారు. 2014కు ముందు మన పల్లెలు, పట్టణాలు ఎలా ఉన్నాయి.. స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ పాలనలో ఎలా అభివృద్ధి చెందాయనే విషయాన్ని ప్రజలకు తెలిసేలా మీడియా గ్రూపుల్లో పోస్టులు పెట్టాలని సూచించారు. కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ర్టాల్లో అందిస్తున్న పింఛన్ ఎంత.. మన రాష్ట్రంలో ఇస్తున్న పింఛన్ ఎంత అనేది తేడా ప్రజలకు తెలిసేలా చూడాలన్నారు. సీఎం కేసీఆర్ పాలనలో నాగార్జునసాగర్ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. ఒక్క నాగార్జునసాగర్ నియోజకవర్గంలోనే ప్రతి నెలా 32 వేల మందికి పింఛన్లు అందుతున్నాయన్నారు. గత ఐదేండ్లలో 8200 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను, 2500 మందికి సీఎం సహాయ నిధి చెక్కులను అందించినట్లు చెప్పారు. రైతు బీమా కింద 1225 మంది రైతుల కుటుంబాలకు రూ. 5 లక్షల చొప్పున ప్రభుత్వం రూ. 67 కోట్లు అందించిందన్నారు. 42వేల మంది రైతులకు ఉచిత విద్యుత్, సుమారు 2 వేల మంది నాయీ బ్రాహ్మణ, రజకులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించినట్లు చెప్పారు. ప్రభుత్వ పథకాలతో లబ్ధి పొందిన వారి అభిప్రాయాలను సోషల్ మీడియాలో పోస్ట్ చేయాలని సూచించారు. సమావేశంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షులు, నాయకులు, సోషల్ మీడియా వారియర్స్ పాల్గొన్నారు.

## నామినేషన్ల స్వీకరణకు సహకరించాలి

- ఆర్ఓ శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఓ శ్రీనివాస్

నిడమనూరు, నవంబర్ 1 : ఈ నెల 3 నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమవుతుందని, ప్రక్రియను ప్రశాంతంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని నాగార్జునసాగర్ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి జె. శ్రీనివాస్ సూచించారు. బుధవారం తన కార్యాలయంలో నిర్వహించిన అఖిలపక్ష ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శుక్రవారం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయడంతో పాటు నామినేషన్లు స్వీకరించనున్నామని, అభ్యర్థులకు సందేహాలుంటే నివృత్తి చేసుకునేందుకు రిసెప్షన్ కౌంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఒక్కో అభ్యర్థి వెంట ముగ్గురిని మాత్రమే లోపలికి అనుమతిస్తామన్నారు. సమావేశంలో తాసీల్దార్ జంగాల కృష్ణయ్య, అఖిలపక్ష పార్టీల నాయకులు తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, ముువ్వా అరుణ్ కుమార్, చిట్టిమల్ల శ్రీనివాస్, రాము, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మ దహనం



కాంగ్రెస్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

పెద్దవూర, నవంబర్ 1 : దుబ్బాక బీఆర్ఎస్ అభ్యర్థి కొత్తకోట ప్రభాకర్‌రెడ్డి పై కాంగ్రెస్ హత్యారాజకీయాలకు పాల్పడడాన్ని నిరసిసిస్తూ బుధవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ చైర్మన్ గుంటక వెంకట్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు జటావత్ రవినాయక్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ప్రజలు బీఆర్ఎస్ వైపే ఉండడం చూసి ఓర్వలేకనే కాంగ్రెస్ నాయకులు ఇలాంటి ఘటనలకు పాల్పడుతున్నరని విమర్శించారు. హత్యాయత్నానికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్‌కేవీ ప్రధాన కార్యదర్శి షేక్ బషీర్, పార్టీ మండల కార్యదర్శి మునిరెడ్డి, రైతుబంధు సమితి మండల కో- ఆర్డినేటర్ బోయ నరేందర్‌రెడ్డి, సర్పంచ్ నడ్డి లింగయ్య, నాయకులు శ్రీకర్ నాయక్ పాల్గొన్నారు.

## నాగార్జునసాగర్‌ను సందర్శించిన 12 దేశాల బౌద్ధ స్కాలర్స్



బుద్ధవనంలోని మహాస్థూపం వద్ద బౌద్ధ స్కాలర్స్

నందికొండ, నంబర్ 1 : నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్‌లోని నాగార్జునకొండ, బుద్ధవనాన్ని బుధవారం 12 దేశాలకు చెందిన బౌద్ధ స్కాలర్స్ సందర్శించారు. హిల్‌కాలనీలోని లాంచీ స్టేషన్ నుంచి లాంచీలో నాగార్జునకొండకు వెళ్లిన స్కాలర్స్ మ్యూజియం, సింహాల విహారం, బౌద్ధ శిల్పాలను సందర్శించారు. అనంతరం బుద్ధవనం చేరుకొని బుద్ధుడి పాదాలకు పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఇండియన్ కౌన్సిల్ ఫర్ కల్చరల్ రిలేషన్స్ ప్రోగ్రాం డైరెక్టర్ సునీల్ కుమార్ సింగ్ మాట్లాడుతూ అక్టోబర్ 25 నుంచి నవంబర్ 3 వరకు భారతదేశంతో పాటు థాయిలాండ్, తైవాన్, కంబోడియా, శ్రీలంక, మలేషియా, భూటాన్, జపాన్, లాస్, వియత్నాం, సౌత్‌కొరియా, నేపాల్‌కు చెందిన 33 మంది బౌద్ధ స్కాలర్స్‌ల బృందం బుద్ధభూమి వందన యాత్ర పేరుతో సెమినార్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో బాగంగా మన దేశంలోని బౌద్ధ క్షేత్రాలను సందర్శించనున్నట్లు చెప్పారు. వీరితో స్థానిక ఎస్ఐ సంపత్‌గౌడ్, అధికారులు ఉన్నారు.

## ఎన్నెస్పీ ఎస్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్‌గా సామెల్ జాన్

నందికొండ, నంబర్ 1 : ఎన్నెస్పీ ఎస్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్‌గా సామెల్‌జాన్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. రామగుండెంలో విధులు నిర్వహించిన ఆయన బదిలీపై సాగర్‌కు వచ్చారు. ఇప్పటి వరకు అడిషనల్ కమాండెంట్‌గా విధులు నిర్వహించిన బ్రహ్మాచారి దామరచర్లకు బదిలీ అయ్యారు. ఎస్పీఎఫ్ సిబ్బంది బ్రహ్మాచారిని ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో ఎస్పీఎఫ్ ఆర్ఐలు భాస్కర్‌రెడ్డి, ఈశ్వర్ రావు, జెన్‌కో ఎస్ఈ రఘురాం పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మిక సంఘం మండల కార్యవర్గం

త్రిపురారం, నవంబర్ 1 : భవన నిర్మాణ కార్మిక సంఘం మండలాధ్యక్షుడిగా మాసారపు రామకృష్ణ ఎన్నికైనట్లు సంఘం గౌరవ సలహాదారుడు నగిరి వెంకన్న తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో జరిగిన సంఘం సమావేశంలో మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు మద్దెల శ్రీను, కమిటీ సభ్యులు చింతకుంట్ల సురేశ్, మామిడి నాగయ్య, అనుముల అంజయ్య, బైరం శ్రీనివాస్, క్యామగిరి, రామకృష్ణ పాల్గొన్నారు.

## బీటీ రోడ్డు పనులు ప్రారంభం

చందంపేట, నవంబర్ 1 : మండలంలోని అచ్చంపేట పట్టి గ్రామ పరిధిలోని సంధ్యాతండాకు మంజూరైన బీటీ రోడ్డు పనులను గురువారం పీఆర్ ఏఈ రాజునాయక్, గ్రామ సర్పంచ్ జర్పుల లోక్యానాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంధ్యాతండా నుంచి చందంపేట మండల కేంద్రానికి, ముర్పునూతల వరకు బీటీ రోడ్డు పనులు జరుగుతున్నాయన్నారు. సుమారు మూడు కిలోమీటర్ల మేర రోడ్డును రూ.3.37కోట్లతో నిర్మిస్తున్నట్లు చెప్పారు. రోడ్డు పూర్తయితే రవాణా సౌకర్యం మెరుగు పడుతుందని పేర్కొన్నారు. బీటీ రోడ్డు నిర్మాణంతో తండా వాసులు హర్షం వ్యక్తం చేశారు. తమ గ్రామానికి రోడ్డు మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి, ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గోప్యానాయక్, దూద్యనాయక్ పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే భగత్ గెలుపు ఖాయం

- ఎంపీపీ వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటేశ్వర్లు

గుర్రంపోడు, నవంబర్ 1: నాగార్జునసాగర్ ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్ రాబోయే ఎన్నికల్లో భారీ మెజార్టీతో విజయం సాధించడం ఖాయమని ఎంపీపీల ఫోరం జిల్లా అధ్యక్షుడు మంచికంటి వెంకటేశ్వర్లు దీమా వ్యక్తం చేశారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధే నోముల భగత్‌ను గెలుపిస్తాయన్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్ష, కార్యదర్శులు గజ్జెల చెన్నారెడ్డి, రామగిరి చంద్రశేఖర్‌రావు, ఎంపీటీసీ దోటి చంద్రమౌళి, మేకల వెంకట్‌రెడ్డి, కుర్మాల్‌రెడ్డి, మునికుంట్ల బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

## పలువురికి ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్



డాక్టరేట్ అందుకున్న అన్నాచెల్లెలు బాణావత్ భాను, శారద

హాలియా, నవంబర్ 1: అనుముల మండలం నాయుడు పాలెం గ్రామానికి చెందిన అన్నాచెల్లెలు బాణావత్ భాను,శారద ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఒకే వేదికపై డాక్టరేట్ అందుకున్నారు. భాను వ్యాయామ విద్యలో, ఆయన సోదరి శారద చరిత్ర విభాగంలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. గత నెల 31న హైదరబాద్‌లో జరిగిన కాన్వకేషన్‌లో ఇద్దరూ ఒకే వేదికపై పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. ఒకే కుటుంబంలో ఇద్దరికి డాక్టర్‌రేట్ రావడంపై తల్లిదండ్రులు బాణావత్ సూర్య,రాజీతో పాటు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

### నార్కట్‌పల్లి వాసికి

నార్కట్‌పల్లి : మండలంలోని ఎనుగులదోరి గ్రామానికి చెందిన మహేశ్వరం శోభన్‌బాబుకు ఓయూ డాక్టరేట్ లభించింది. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన అడోబ్ సీఈఓ శాంతన్ నారాయణ, ఓయూ వీసీ చేతుల మీదుగా డాక్టరేట్‌ను అందుకున్నారు.

### నకిరేకల్ వాసికి పీహెచ్‌డీ

నకిరేకల్ : మండలంలోని చందుపట్ల గ్రామానికి చెందిన డాక్టర్ టంగుటూరి సైదులు ఉస్మానియా యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ అందుకున్నారు. సైదులు ప్రస్తుతం నాగార్జున ప్రభుత్వ కళాశాలలో పీజీ విభాగంలో గెస్ట్ లెక్చరర్‌గా పనిచేస్తున్నారు.

### ఎన్జీ, ఉమెన్స్ అధ్యాపకులకు ..

రామగిరి : నల్లగొండలోని ఎన్‌జీ, ప్రభుత్వ మహిళా కళాశాలలకు చెందిన అధ్యాపకులకు ఓయూ పీహెచ్‌డీ(డాక్టరేట్) పట్టాలను అందించింది. ఎన్జీ గ్రంథాలయ శాస్త్ర అధ్యాపకుడు ఎ.దుర్గాప్రసాద్, ఉమెన్స్ కళాశాల భౌతిక శాస్త్రం అధ్యాపకుడు రేఖా వెంకటేశ్వర్లు డాక్టరేట్‌ను అందుకున్నారు. వీరిని ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్ సముద్రాల ఉపేందర్, ఘన్‌శ్యాంతోపాటు సహచార అధ్యాపకులు అభినందించారు.

## జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌పై విచారణ



విచారణ అధికారికి వినతిపత్రం ఇస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులు

హాలియా, నవంబర్ 1 : హాలియా ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అధ్యాపకురాలిపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్నట్లు వచ్చిన ఫిర్యాదుపై విచారణకు ఇంటర్ బోర్డు అధికారులు హన్మకొండ డీఐఈఓ గోపాల్‌ను విచారణ అధికారిగా నియమించారు. దాంతో బుధవారం ఆయన హాలియా ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వచ్చారు. అధ్యాపకులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పలు ప్రశ్నలకు అధ్యాపకుల అభిప్రాయాలను లిఖిత పూర్వంగా తీసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కళాశాల అధ్యాపకురాలి ఫిర్యాదు మేరకు ఇంటర్మీడియట్ అధికారుల ఆదేశాలతో ప్రిన్సిపాల్‌పై వచ్చిన ఆరోపణలపై విచారణ చేసినట్లు తెలిపారు. అందుకోసం అధ్యాపకుల అభిప్రాయాలు తెలుసుకున్నానని, ఉన్నతాధికారులకు నివేదిక అందించనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ, ఐద్వా నాయకులు అధ్యాపకురాలిని లైంగికంగా వేధింపులకు పాల్పడిన ప్రిన్సిపాల్‌ను ఉద్యోగం నుంచి తొలగించాలని కోరుతూ ఆందోళన చేశారు. అనంతరం విచారణ అధికారికి వినతిపత్రం అందించారు. ఈ విషయమై ప్రిన్సిపాల్ విజయనాయక్‌ను వివరణ కోరగా కళాశాల నిర్వహణ పట్ల కఠినంగా వ్యవహరించడంతో కావాలనే తన మీద తప్పుడు ఫిర్యాదు చేశారని తెలిపారు.